# ప్రజలపై భారాలు మోపే జిఎస్‌టిని వ్యతిరేకిస్తూ సభ




జి.ఎస్.టి.ని వ్యతిరేకిస్తూ మచిలీపట్నంలో సభ

**బందరు, 4-7-17 :**

సామాన్య ప్రజలపై భారాలు మోపే; చిన్న, మధ్యతరహా పరిశ్రమదారులు, వ్యాపారులను దెబ్బతీసే; విదేశీ, స్వదేశీ బడాకంపెనీల వ్యాపార ప్రయోజనాలను నెరవేర్చే వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)ను వ్యతిరేకిస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కృష్ణాజిల్లా కమిటి ఆధ్వర్యంలో 4-7-17న మచిలీపట్నం ప్రభుత్వ రిటైర్డ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హాలులో సభ జరిగింది. ఈ సభలో ప్రధానవక్తగా విచ్చేసిన చార్టెడ్ ఎకౌంటెంట్ ఆర్.శశికుమార్ ప్రసంగిస్తూ 'పెద్దనోట్ల రద్దు సందర్భంగా ప్రజల ముందు ఏ భాగోతం అయితే ప్రదర్శించారో అదే భాగోతాన్ని వస్తు సేవల పన్నును అమలుచేసే ముందు మళ్ళీ ప్రదర్శించారని' అన్నారు. 'దేశమంతటా ఒకే పన్ను' అన్న నినాదం బూటకం. నిజానికి ఇందులో పరోక్ష పన్నుల పోటు అధికంగా వుంటుంది. ఇది ప్రజానీకంపై అంతులేని భారాలను మోపుతుంది. సర్వీసు టాక్స్ పూర్వం 1 శాతం వుండేది. అది కూడా టెలీకమ్ రంగంలో మాత్రమే. ఆ తర్వాత 15 శాతం, ప్రస్తుతం 18 శాతం పన్ను విధిస్తున్నారు. కేంద్రప్రభుత్వం జియస్‌టి అమలుకై ఏర్పాటు చేసిన జిఎస్‌టి నెట్‌వర్క్‌లో 60 శాతం ప్రైవేటు రంగానికి, 40 శాతం ప్రభుత్వానికి వాటా వుంటుంది. ఇంత పెద్ద ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ, పర్యవేక్షణ ఓ విదేశీ కార్పోరేట్ కంపెనీకి అప్పగించటమంటే ఏం అనుకోవాలి? ఈ పరిణామం ఎక్కడికి దారి తీస్తుందని' ప్రశ్నించారు. జిడిపిలో 2 శాతం పన్ను ఆదాయం పెంచుతామని కేంద్రప్రభుత్వం స్పష్టంగా ప్రకటిస్తోంది. ఈ స్థితిలో 20 లక్షలు వార్షిక టర్నోవర్ కల్గిన ఉత్పత్తిదారులు, వ్యాపారులు, సేవారంగంలో ఉన్నవారు పన్ను పరిధిలోకి వస్తారు. అంతేగాక ఆన్‌లైన్ లావాదేవీలను నిరూపించేందుకు అదనపు ఖర్చు, భారం వారిపై పడుతుంది. గతంలో చిన్న ఉత్పత్తిదారులు, చిన్న పారిశ్రామికవేత్తలు ఉత్పత్తిచేసే వస్తువులపై రిజర్వేషన్ వుండేది. ఇప్పుడు దీన్ని ఎత్తివేస్తున్నారు. అలాగే పన్ను మినహాయింపులుండేవి. దీనికి ప్రస్తుతం మంగళం పాడారు. ఈ స్థితిలో ఈ పోటీలో సహజంగానే సంఘటితరంగంలో వున్న కార్పొరేట్ వర్గాల తాకిడికి చిన్న పరిశ్రమదారులు, వ్యాపారులు దెబ్బతిని పోవడం ఖాయమని అన్నారు. 'అందుకే మోడీ ప్రభుత్వం చిన్న రంగాల్లో ఉత్పత్తి వాటాను తగ్గించి పెద్దరంగాల్లో ఉత్పత్తి వాటాను పెంచుతామని చాలా స్పష్టంగా ప్రకటించిందని' గుర్తుచేశారు. 'జిఎస్‌టి అన్ని రంగాల ప్రజలపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుందని, అందుకే జిఎస్‌టి వ్యతిరేకించాలని' అన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కా॥ఎం.నాగరాజు ప్రసంగిస్తూ 'పన్నుల రంగంలో ప్రపంచబ్యాంకు సంస్కరణలకు ఆదేశించింది. అందుకే గత పాలకులు వ్యాట్‌ను, ప్రస్తుత మోడీ ప్రభుత్వం జిఎస్‌టిని తీసుకొచ్చారు. వ్యాట్ దెబ్బకు చిన్నపరిశ్రమల జిడిపిలో వున్న ఉత్పత్తి వాటా 55 శాతం నుండి 23 శాతంకు పడిపోయింది. ప్రస్తుత జిఎస్‌టి దెబ్బకు ఈ స్థితి ఇంకా దిగజారుతుందని అన్నారు. చిన్న రంగాల్లో వున్న పెట్టుబడులను, మార్కెట్లు, వనరులను
ప్రధానంగా విదేశీ బహుళజాతి కంపెనీలపరం చేయడమే లక్ష్యంగా వుంది' అని అన్నారు. రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥యద్దనపూడి సోని మాట్లాడుతూ 'జిఎస్‌టి పన్నుల విధింపులో సంపన్నుల విలాసాలకు, సామాన్య ప్రజల రోజువారీ అవసరాలకు విధించిన పన్నులలో పక్షపాతం వుంది. ఉదా॥కు వజ్రాలపై 3 శాతం, బీడీ కట్టపై 28 శాతం, అలాగే విమానం అద్దెకు తీసుకొంటే 5 శాతం, నిత్యావసర సరుకులపై 5 శాతం నుండి 10శాతం వరకు విధించారని' అన్నారు. చిన్న పరిశ్రమలను, చిన్న వస్తువులను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఆయిల్ రంగంలో 8 వేల రిటైల్ అవుట్‌లెట్లను 4 విదేశీ కంపెనీలకు అనుమతులిచ్చారు. కిరాణారంగంలో మరో 3 వేల రిటైల్ అవుట్‌లెట్లకు అనుమతించబోతున్నారు. ఈ స్థితిలో ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న పాలకుల విధానాలపై పోరాటం చేయాలని' అన్నారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)జిల్లా కార్యదర్శి కా॥వీరబాబు విదేశీ కార్పోరేట్ వర్గాలకు ఊడిగంచేస్తున్న దళారీ పాలకుల వైఖరిని ఎండగట్టారు. సభకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లానాయకులు కా॥ జె. జగన్ అధ్యక్షత వహించారు. సభలో 125 మంది మధ్యతరగతి, పేదవర్గాల ప్రజలు, వ్యాపారులు పాల్గొన్నారు.

ooooo